క్లుప్తంగా

కరాటే పోటీల్లో ప్రణీత్‌సేత్ ప్రతిభ



పతకాలు సాధించిన ప్రణీత్‌సేత్

ఏలూరు రూరల్ : కరాటే పోటీల్లో ఏలూరుకు చెందిన ఏడేళ్ల చిన్నారి జి.ప్రణీత్‌సేత్ తన ప్రతిభ చాటుకుంటున్నాడు. మూడేళ్ల నుంచి కరాటే సాధన చేస్తూ పతకాలు పంట పండిస్తున్నాడు. జూన్ 11 నుంచి 15 వరకు డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. 2023లో జరిగిన ఏపీ షాటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించాడు. 2024లో జరిగిన ప్రెసిడెంట్ కప్ పోటీల్లో సైతం సిల్వర్, బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. 2024లో జాతీయ కరాటే పోటీల్లో మరో బంగారు పతకం, ఏపీ స్టేట్‌లెవెల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సైతం మరో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి కియో నేషనల్ పోటీలకు అర్హత సాధించాడు.

యుద్ధ ధ్వని పుస్తకాల పంపిణీ



యుద్ధ ధ్వని పుస్తకాలను పంపిణీ చేస్తున్న కోర్ ఆఫీసర్లు

దెందులూరు: జిల్లాలో సాల్వేషన్ ఆర్మీ సంఘాలకు 1900 ధ్వని పుస్తకాలు పంపిణీ చేశామని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ యేసు రాజ్యం అన్నారు. బుధవారం డివిజనల్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో డీఎస్ నాగరాజు, డీపీఎస్ కమల్రాజు, కొవ్వలి కోర్ ఆఫీసర్ సుబ్బారావులతో కలిసి యుద్ధ ధ్వని పుస్తకాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాల్వేషన్ ఆర్మీ సాంఘిక ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక నిర్వహణ కార్యక్రమాలు ప్రణాళిక సంఘాల బలోపేతం సంబంధించి యద్ధధ్వని పుస్తకాల్లో ఇవ్వనున్నట్టు యేసు రాజ్యం అన్నారు.

వాటర్ ప్లాంట్ల పరిశీలన

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): దెందులూరులో ఉన్న గోదావరి జలాల చెరువు నుంచి వచ్చిన రా వాటర్ ప్యూరిఫై చేసి నగరంలో ఉన్న జనాభా లెక్క ప్రకారం ప్రతిరోజు మనిషికి 135 లీటర్లు చొప్పున 36 ఎంఎల్‌డీ వాటర్‌ను నగర ప్రజలకు అందిస్తున్నామని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. బుధవారం ప్రజలకు మంచినీటిని అందించే రెండు ట్రీట్‌మెంట్ ప్లాంట్లను కమిషనర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పంపులు చెరువు ప్రాంగణంలో 30 ఎంఎల్‌డీ, 8 ఎంఎల్‌డీ రెండు ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. ప్లాంట్ పనితీరు, క్లోరినేషన్ ప్రక్రియ, ఫిల్టర్ బెడ్స్ క్లీనింగ్, వేస్ట్ వాటర్ వెళ్లే విధానాన్ని పరిశీలించామని చెప్పారు.

తగలబడుతున్న తమ్మిలేరు!

- ఏటిలోను, గట్టుపైనా చెత్తా చెదారం
- తొలగించకుండా తగులబెడుతున్న యంత్రాంగం
- నిప్పుల కొలిమిలా చొదిమెళ్ల రహదారి
- పొగతో వాహన చోదకులకు ఇక్కట్లు



చొదిమెళ్ల రోడ్డులో ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రహదారిని కమ్మేసిన పొగ



చొదిమెళ్ల వద్ద తమ్మిలేరులో తగలబడుతున్న ఎండిన పొదలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తమ్మిలేరు తగలబడడమేమిటని ఆలోచిస్తున్నారా!. ఆ ప్రాంతానికి వెళితే నిజంగా తమ్మిలేరే తగలబడుతుందేమో అనే అనుమానం ప్రతి ఒక్కరికీ రాక మానదు. ఎక్కడ చూసినా ఎగసిపడే మంటలు, మంటలు ఆరిన చోట్ల విపరీతమైన పొగ, మంటలు, నిప్పుల నుంచి వెలువడే వేడి వాహనచోదకులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఈ పరిస్థితి నగర పరిధిలోని చొదిమెళ్ల రోడ్డులో వెళ్లే ప్రతి ఒక్కరికీ నిత్యం అనుభవమౌతునే ఉంటుంది. కాకపోతే ఉరుకులు, పరుగుల జీవితంలో ఎవరి బిజీలో వారు వెళ్లిపోతూ పెద్దగా ఎవరూ పట్టించుకోరు. ఎవరికీ ఫిర్యాదు చేయరు. కాకపోతే ఎప్పుడో ఒకప్పుడు ఈ పరిస్థితికి ఫుల్‌స్టాప్ పడుతుందనే నమ్మకంతో ఉంటారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందకపోవడం వల్లో ఏమో ఇప్పటి వరకు అధికారులెవరూ ఈ వైపు దృష్టి సారించడం లేదనే అనుకోవాలి.

డంపింగ్ యార్డులా తమ్మిలేరు

తమ్మిలేరు ప్రకృతి ప్రసాదించిన వరంలా ఏలూరు నగరం చుట్టూ ప్రవహిస్తూంటుంది. ఇది ప్రధానంగా చింతలపూడి నియోజకవర్గంలోని నాగిరెడ్డిగూడెం వద్ద నుంచి నగరంలోకరి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి పాయలు పాయలుగా విడిపోయి నగరానికి దాదాపు అన్ని వైపులా ప్రవహిస్తుంది. ఒక్క వర్షాకాలం తప్ప తమ్మిలేరులో పెద్దగా నీరు ప్రవహించదు. దీంతో స్థానికులకు ఇది ఒక డంపింగ్ యార్డులా ఉపయోగిస్తున్నారు. ఎక్కడలేని చెత్త అంతా తమ్మిలేరులోకే వేసేస్తుంటారు. కాలకృత్యాలూ, బహిర్భూమి ఇందులోనే తీర్చుకుంటారు. నగరంలో గృహాల్లో వాడిన వ్యర్థనీటిని తమ్మిలేటిలోకే వదిలేస్తుంటారు. అవసరమైన వారు కొన్ని చోట్ల నుంచి ఇసుకను తరలించుకుపోతుంటారు. ఇంతగా నగర ప్రజలకు ఉపయోగపడుతున్న తమ్మిలేరును అధికారులు ఎవ్వరూ పట్టించుకోరు. దీంతో తమ్మిలేరు ఒక నిరర్థక ప్రకృతి వనరుగా మాత్రమే మిగిలిపోతోంది.

నిప్పుల కొలిమి

తమ్మిలేరు గట్టుపై ఉన్న వ్యర్థాలను తగులబెడుతుండడంతో చొదిమెళ్ల రహదారి నిప్పుల గుండంగా మారుతోంది. ఏటిగట్టుపై తగలబడే వ్యర్థాల నుంచి వెలువడే వేడికి ఆ దారిలో వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. తమ్మిలేరు గట్టు చింతలపూడి రోడ్డుకు ఆనుకునే ఉండడంతో ఇంచుమించుగా రోడ్డుపైనే అగ్ని కీలలు దర్శనమిస్తుంటాయి. మంటలు ఆరిన తరువాత నిప్పులు నివురుగప్పి, ప్రయాణికులకు మాత్రం వేడి వాతావరణాన్ని కలిగిస్తుంది. ఈ పరిస్థితి దాదాపు ఒక కిలోమీటరు దూరం వరకు ఉంటుంది.

పొగతో ఇబ్బంది

తమ్మిలేరు లోపల, ఏటిగట్టుపైన మంటల నుంచి వెలువడే పొగ ఆ రహదారిని చుట్టుముట్టేస్తోంది. ఒక్కొక్కసారి పొగ బాగా ఎక్కువై రహదారి కనిపించని పరిస్థితి ఎదురవుతుంది. ఏలూరు నుంచి జానంపేట, లింగపాలెం, చింతలపూడి, సత్తుపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సులు, చిన్నకారులు, మోటారు సైకిళ్లు, ఆటోలు, ఇతర రవాణా వాహనాలు రహదారిపై పొగ కమ్మేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. దీనికి తోడు ఈ పొగ చాలా దూరం వ్యాపిస్తుండడంతో అటుగా వెళ్లే వారు పొగను పీల్చి ఊపిరి ఆడని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పొగ గుండెలకు పట్టి వ్యాధులకు గురౌతామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తగులబెట్టేస్తున్నారు

వర్షాకాలంలో మినహా తమ్మిలేరులో నీరు ఉండకపోవడంతో ఏటిలోను, గట్ల వెంట తుప్పలు విపరీతంగా పెరుగుతుంటాయి. వీటిని ఎండిన తర్వాత తొలగించాల్సిన అధికారులు ఏటిలోనే తగులబెట్టేస్తున్నారు. ఈ పరిస్థితి ఎక్కువగా ఏలూరు నుంచి చింతలపూడి వెళ్లే మార్గంలో చొదిమెళ్ల గ్రామానికి ముందు కనిపిస్తుంటాయి. ఏటిలోని చెత్త మాత్రమే కాక ప్రజలు విసిరేసే చెత్త, ముఖ్యంగా వినియోగించి పడేసిన కొబ్బరి బొండాల వ్యర్థాలు, గృహ నిర్మాణ వ్యర్థాలు, దూది, స్పాంజ్ పరుపులు, పాత చెక్క సామగ్రి ఇలా ప్రతీదీ ఈ రహదారిలో ఏటిగట్టుపైనే పడేస్తున్నారు. అధికారులు వాటిని తొలగించకుండా అక్కడే నిప్పుపెట్టి మమ అనిపిస్తున్నారు.

వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి



తమ్మిలేరు నగరానికి వన్నెతెచ్చే ప్రకృతి ప్రసాదం. దీనిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. తమ్మిలేరును విషతుల్యం చేయకుండా అడ్డుకోవాలి. ఈ ఏరు కలుషితం కాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు నడుంబిగించాలి. ఏటిగట్టుపై వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– ఎండీ ఆరీఫ్, స్థానికుడు

పొగ, వేడి నుంచి విముక్తి కలిగించాలి



తమ్మిలేరులో పెరిగే చెట్లు, ముళ్ల పొదలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎండిన పొదలను అక్కడే తగులబెట్టకుండా డంపింగ్ యార్డుకు తరలించాలి. చింతలపూడి రోడ్డులో ప్రయాణికులకు పొగ, వేడి నుంచి విముక్తి కలిగించాలి.

– గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు

చట్టాలపై అవగాహన అవసరం



భోజనం రుచి చూస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. బుధవారం శనివారపుపేట జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహార విషయంలో రాజీ పడవద్దని, వంటల్లో ఉపయోగించే నూనె విషయంలో మరింత నాణ్యత పాటించాలని సూచించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. బాలబాలికలు సోదర భావంతో కలిసిమెలిసి చదువును అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీఓ సూర్య చక్రవేణి, వన్ స్టాప్ అడ్మిన్ నిర్మల, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 19, 20 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్ క్వార్టర్స్, ఎస్పీ ఆఫీసు, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ప్రాంతం, అమీనా పేట ఏటిగట్టు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిక్షా ఘాటి, ఏడు ఫోరీల సెంటర్, వేణు గోపాల స్వామి టెంపుల్, విజయలక్ష్మి థియేటర్, బుద్ధ పార్క్, పంట కాలువ రోడ్డు, హెడ్ పోస్ట్ ఆఫీసు ఏరియా, వైఎంహెచ్ఏ హాల్ ఏరియా, బిర్లా భవన్, మార్కెట్ ఏరియా, పెరుగుచెట్టు, టీచర్ల కాలనీ, పెరుగుచెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మునిసిపల్ ఆఫీసు, అగ్రహారం, కెనాల్ రోడ్, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, బాలాజీ థియేటర్, జంట కల్యాణ మండపాలు, రామకోటి, ఏడుకాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారి వీధి, కబేళా ఏరియా, తూర్పు వీధి శివాలయం ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, కత్తేపువీధి, పిచుకగుంట సెంటర్, చిన్న జెండా సెంటర్, వెంకన్నచెరువు రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. సత్రంపాడు, మండ్ల వారి వీధి ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, హనుమాన్ నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, గ్రీన్ సిటీ, పెదపాడు రోడ్, శివ నగర్, సాయి నగర్, గణేశ్ కాలనీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ, ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక భేటీ







మాజీ సీఎం జగన్‌ను కలిసిన కార్పొరేటర్లు స్రవంతి , జయకర్, రాము, జోబ్, వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఏలూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు, కార్పొరేటర్లను ఆయన అధినేతకు పరిచయం చేశారు. జగన్‌ను కలిసిన వారిలో ఏలూరు నగర కార్పొరేటర్లు తుమరాడ స్రవంతి, ఇమ్మానియేల్ జయకర్, తంగెళ్ల రాము, డింపుల్ జోబ్ ఉన్నారు. ఆయన కొద్దిసేపు వారితో ముచ్చటించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జగన్‌తో కలిసి ఆయనతో మాట్లాడడం సంతోషంగా ఉందని వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

21న 5 వేల మందితో యోగాభ్యాసన

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి కళాశాలలో 5 వేల మందితో మెగా యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధత, తదితర అంశాలపై బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 21న యోగ దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల 21న ఏలూరులోని ఇండోర్ స్టేడియం, మరో ప్రాంతంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇంతవరకు యోగాంధ్ర కార్యక్రమంలో 9,02,421 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు తెలిపారు. యోగాభ్యాసన కార్యక్రమాల్లో భాగస్వాములైన వారిలో 6,91,418 మందికి సర్టిఫికెట్లు జారీ చేయగా, అందులో 29,639 మంది సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ పొందారని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ట్రాన్స్‌కో ఎస్ఈ సల్మాన్‌రాజు, సీపీఓ వాసుదేవరావు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సెట్వేల్ సీఈఓ ప్రభాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఆర్ఐఓ యోహాన్, ఆయుష్ డీడీ లక్ష్మి శారద, డీఎంహెచ్ఓ డా. మాలిని పాల్గొన్నారు.

21న వైఎంహెచ్ఏలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) 121 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు సంస్థ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి గుడిపాటి లలితా శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు వేణుగోపాల్ లునాని, పి.సాంబశివరావుల ఆధ్వర్యంలో దత్త క్రియ యోగాలో శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణలో అందరూ పాల్గొనాలని కోరారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	66
వంకాయలు (కాంతులు)	26	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	26	చామదుంపలు	48
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	24	అల్లం	64
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కలెక్టరేట్‌లో అర్జీదారుల క్యూ




ఇదేదో.. సంక్షేమ పథకాల కోసమో.. సినిమా టిక్కెట్ల కోసమో కట్టిన క్యూ కాదు. కొల్లేరులో తాము ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం నుంచి వచ్చిన కొల్లేరు సాధికారిక కమిటీ సభ్యుల ముందు తమ గోడును వినిపించేందుకు బుధవారం జిల్లాలోని కొల్లేరు గ్రామాల్లో నివసించే ప్రజలు ఏలూరు కలెక్టరేట్‌లో ఇదిగో ఇలా క్యూ కట్టారు.

– సాక్షి, ఫొటో గ్రాఫర్ / ఏలూరు

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

కామవరపుకోట: ప్రతిరోజూ యోగ సాధనతో ఆరోగ్యంగా మానసికంగా ప్రశాంతంగా ఉంటామని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ విజయరాజు తెలిపారు. 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలో గుంటుపల్లి గ్రామ పంచాయతీ జీలకర్రగూడెం బౌద్ధ గుహల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించారు. పర్యాటక శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పట్టాభి మాట్లాడుతూ యోగాలో శారీరక భంగిమలు, శ్వాస పద్ధతులు ధ్యానాన్ని ఏకం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు యోగ చేయడం వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగాపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతం కోరుతూ ర్యాలీ



మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చింతలపూడి : జూలై 5, 6, 7 తేదీలలో నిర్వహించ తలపెట్టిన సీపీఐ ఏలూరు జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ మహాసభల్లో చింతలపూడి అభివృద్ధికి ఉపయోగపడే ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, ఈ పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.40 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. చింతలపూడి కేంద్రంగా విస్తరించి ఉన్న బొగ్గు నిల్వలను వెలికి తీయాలన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు గోదావరి జలాలను మళ్లించాలని కోరారు. వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం ఇవ్వాలన్నారు. చింతలపూడిలో ప్రారంభమైన ర్యాలీ రేచర్ల, ఎర్రగుంటపల్లి, అల్లిపల్లి, సీతానగరం, చింతపల్లి, కమలాపురం, ఎండపల్లి, రాఘవపురం, గణిజర్ల, మల్లయ్యగూడెం, సమ్మెట వారి గూడెం మీదుగా చింతలపూడి చేరుకుంది. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, మండల సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పుల్లూరు సోమశేఖర్, మండల కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే మస్తాన్, ఎం అలెగ్జాండర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముల్లగిరి లాజరు, ప్రజా నాట్య మండలి గాయకుడు ఎస్ లెనిన్ బాబు, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు పాల్గొన్నారు.

చెవిరెడ్డి అరెస్ట్ కక్ష సాధింపే



సూర్యనారాయణరావు

దెందులూరు: వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ కూటమి సర్కారు కక్ష సాధింపులో భాగమేనని కూటమి సర్కార్ అక్రమ అరెస్టులు, దాడులు దౌర్జన్యాలపై రాష్ట్ర బీసీ సంఘం త్వరలో ప్రణాళిక సిద్ధం చేస్తుందని వైఎస్సార్‌సీపీ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎం సూర్యనారాయణరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సమస్యల పట్ల అవగాహన కలిగిన విద్యార్థి సంఘ నాయకుడిగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా సంఘ సేవకునిగా భాస్కర్‌రెడ్డికి సమాజంలో మంచి పేరు ఉందని తెలిపారు. అక్రమంగా ఆయన్ని అరెస్టు చేసినంత మాత్రాన ఆయన లక్ష్యాన్ని దెబ్బతీయలేదని వైఎస్ జగన్ సైనికుడిగా మరింత బలంగా వేగంగా ముందుకు నడుస్తాడని భాస్కర్ రెడ్డికి రాష్ట్ర బీసీ సంఘం మద్దతు ప్రకటిస్తోందని సూర్యనారాయణ అన్నారు. అక్రమ అరెస్టులు వేధింపులు దౌర్జన్యాలపై రాష్ట్ర బీసీ సంఘం త్వరలోనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని అన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పోణంగి గ్రామంలో ఒక బాలిక వివాహాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పోణంగికి చెందిన యువకుడి (20)కి బాలిక (17)కు బుధవారం వివాహం చేసేందుకు పెద్దలు సిద్ధంకాగా, ఏలూరు రూరల్ ఏఎస్సై స్వామి తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు.